# గుణసంధి

అ–ను–బంధం...అని, బిగ్గరగా సణుక్కుంటున్నట్లు గొణుగుతున్నాడు...నేస్తం.

ఆ ఊరివాడిని కాబట్టి, అభిమానంకొద్దీ... 'కృష్ణా పత్రిక సారస్వతానుబంధం' అని నేను కలగంటున్నట్టు అర్థం చేసుకున్నాను.

'కాదోయీ...ఋణానుబంధం...' ఇదీ వాడి సొద.

“ఎక్కడో–ఏకడనో, పల్లెల్లో పుట్టి–పెరిగిన బందరులో, పద్దు వ్రాసికొనుక్కున్న ఉత్తరీయం, అలహాబాదులో ఆ చలిలో గజగజలాడే ముసలిబడుగు అవస్థకు గుండె కరగి...రైలు కదులుతూండగా అలా కిటికీలోంచి గిరవాటు వేశాను... ఎక్కడికెక్కడో చూశావా...యింతకూ అది వాడికి ప్రాప్తం...

ఇత్యాదయః...

అవును–భాయీ–గా తల ఊగించుతూ, దానబ్బగా, నా కథ అల్లాను...

“దోవవెంట పోతూవుంటే...కానీ దొరికింది. కానీ దొరికితే, కలిసివస్తుందని నానుడి. కానీ చూద్దాం...పార్కు మలుపులో కానీ–కానీ లాటరీ పరుచుకు కూర్చుంటే, బిళ్లేరీ అద్దంమీద దాన్ని కాచాను: కాచి–కాచి, కలకాలం ఉసూరుమనేట్టు, అర్థరూపాయి, వాడిదగ్గర దోచాను.

(చెప్పడం మరచిపోయినట్లున్నాను-యిందాకటినుంచీ ఇదంతా జరుగుతూన్నది...ఎక్కడోకాదు, మన బెజవాడలో-)

అప్పటికి రెండున్నర అయింది. మధ్యాహ్నం. ఆదివారం పగలుసినిమాకు ఆ కాస్త ఖర్చుపెట్టేస్తే...ఆ దోషం అంతటితో తీరిపోతుందనుకున్నాను.

కాఫీ—గీఫీ...కాసిని సిగరెట్లూ ... ఆనుకోనిచ్చే తరగతికి డబ్బులు మిగుల్చుకుంటే చాలు.

...త్రోవలో ఆడుతూ-పాడుతూ నేను అక్కడికిచేరుకునేటప్పటికే ఆట మొదలు వేశారు.

ఆవాళా యింకా, విప్రనారాయణే! అదివరకు దాన్ని కచ్చా-పచ్చాగా అయిదారుసార్లు, సగం-సగం చూశాను. అరవచింతామణేమోకదా అనుకొని పరుగెత్తాను సుమా... తారీఖుతడిసి సిసలుగా కనబడటంలేదు. (అది రేపటినుంచి)- అన్నాడు, కన్నంఅవతలవాడు.

ఇవతల నేనుతప్ప ఇంకో పిట్ట మిగలలేదు. యింతలో, వాన తగులుకున్నది.

ఆడవాళ్ళ గేటుమీాది ఆర్చితప్ప...ఆ బారు-బారునా, ఎక్కడా ఆచ్ఛాదన లేదు...అక్కడే నక్కాను.

నాపక్కను, ఓకుఱ్ఱవాడు, చిరుగులబనీనంతా తడిసి ముద్దయి, తలుపురెక్కనానుకొని యీాదురుకు గజ-గజలాడుతున్నాడు.

గేటులో ఉండే రకమేమో అనుకున్నాను. కాదన్నాడు. చేగోడీలబావతేమో అనుకున్నాను; ఊహుఁ

అన్నాడు. అన్నా, వాళ్ళూ అందరూ ముందు లోపలికి వెళ్ళిపోతే, తానుఒక్కడూ వెనకపడి మిగిలిపోయినా నన్నాడు. ఎల్లా లోపలికిపోవడం? డబ్బులు వాళ్ళదగ్గిర వున్నాయి... టిక్కెట్టు లేనిదే గేటుదగ్గిర, లోపలికి పోనీయరు. ఎల్లా లోపలికి వెళ్ళడం?...

అవును పాపం, టిక్కెట్టు లేకుండా లోపలికి పోలేడు...

ఆ కాసిని డబ్బులూ పెట్టి టిక్కెట్టుకొని, అది వాడి చేతులో పెట్టి, ఉడాయించనున్నాను. అంత వానలోనూ తడుస్తూ నేను యింటికి వచ్చాను...

చూడు...ఎక్కడి కెక్కడ?...

ఎవరో పసివాడో పెద్దవాడో... పారేసుకున్న కానీ...

ఎందరి కాన్లో దులిపి...నాకు కట్టబెట్టాడు, లాటరీ వాడు.

నేను అది మూటకట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి ...హస్తార్పితంగా అందులో కొంత...ఆ పసివాడిపరంగా దరిసించాను. ఎక్కడి కెక్కడ?...

—'ఆ కుఱ్ఱవాడి మాటలన్నీ నిజమని నమ్మావ్?'

'లేదోయ్...అవన్నీ అబద్ధాలని వాడి మొఖమే అంటూంది.'

'అయితే, మరి...'

...వాడు అనుకోని పని మనం చేస్తే... ఆ హాయికి ఖరీదు లేదు.

...'వానలో తడవకపోతే, వెలిసేదాకా ఆగితే ఏం

ముంచుకుపోయిందో...?'–అంతావిన్నతరువాత యీ సందేహం రాకతప్పదు.

'ఏమో, అప్పుడలా తోచిందికాదు'.

'అవునులే. అంతటి ఘనకార్యంచేసినప్పుడు...ఆమాత్రం ఆవేశం...ఆపాటి ఒళ్ళుతెలియకపోవడం లేకపోతే, ఎల్లా? ఆ హుషారులో ... ఆకాశంమీద నడిచాననుకుంటాను!...ఏం?'

ఊహుఁ... అడుగుతీసి అడుగువేయలేకపోయినాను; అందుకే తడిసి ముప్పందుమైంది!

'ఎందుచేతనో?...'

'ఆఁ ... ముక్తసరిగా టిక్కెట్టు మాత్రమే కొని యిచ్చాను కాని...పైనో అర్ధణా అణా కొనుక్కుతినమని యిచ్చేపాటి తెలివీ, తెగువా లేకపోయింది కదా... యీ ఆలోచన పోయేప్పటికల్లా, నామీద నాకే ఎంత అసహ్యం వేసిందనుకున్నావ్!'

'ఔనులే పాపం... నీ ఔదార్యం ఎవరెరుగరు? కాని...నీజేబు ఆ తరుణంలో పూర్తిగా ఖాళీఅన్నసంగతి... నీకు గుర్తులేకపోయినా...మేము గ్రహించుకోగలము...'

'ఛస్...నీ విషపు ఆలోచనతో కథ కాస్తా చెడిపోయింది...'

'కాదోయ్...ఇది కథే అయితే ఓ కొలిక్కివచ్చి పకడ్గా రక్తికట్టింది...'

(సాగదీసిన కొద్దీ...బిగిసి పీటముడి పడుతుంది... ఇద్దరమూ కథల కామరాజులమే...)

*